క్లుప్తంగా

విద్యార్థిని స్కూల్ ఫీజు చెల్లింపు



సత్తెనపల్లి: కరోనా మహమ్మారి ఎన్నో జీవితాలను కబళించిందిదని, చిన్నారులను అనాథలను చేసిందని వీ ఆర్ విత్ యూ సంస్థ బాధ్యులు అన్నారు. సోమవారం పట్టణంలోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్‌లో 10వ తరగతి విద్యార్థిని భోగివర్తి బ్లెస్సికి పాఠశాల ఫీజును సంస్థ సభ్యుడు బొలిశెట్టి సందీప్ చెల్లించారు. పాఠశాల ప్రిన్సిపల్ అంజలీదేవి సంస్థ సేవలను కొనియాడారు. పేద విద్యార్థికి విద్యా దానం జీవితాంతం గుర్తుండిపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు ప్రదీప్, అల్లాబక్షు ఉన్నారు.

కార్మిక సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



సత్తెనపల్లి: పల్నాడు జిల్లా భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం క్యాలెండర్‌ను ఆ సంఘం గౌరవాధ్యక్షుడు గుంటూరు విజయ్ కుమార్ సోమవారం పుతుంబాక భవన్‌లో ఆవిష్కరించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు అవ్వారు ప్రసాద్‌రావు, కార్యదర్శి షేక్ సిలార్ మసూద్, సహాయ కార్యదర్శి కోట ఆంజనేయులు, సహాధ్యక్షుడు సురేష్, సహాయ కార్యదర్శి ఏసు, ఉపాధ్యక్షుడు కొండలు, కోశాధికారి వినుకొండ ఆంజనేయులు, రైతు సంఘం అధ్యక్షుడు గుంటుపల్లి బాల కృష్ణ ఉన్నారు.

గ్రంధశిరిలో కార్డన్ సెర్చ్

– 15 ద్విచక్ర వాహనాలు సీజ్



అచ్చంపేట: యువత గంజాయి, మత్తు పానీయాలకు బానిసలై తమ భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావు హితవు పలికారు. గ్రంధశిరిలో సోమవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సరైన పత్రాలు లేని 15 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులనుద్దేశించి డీఎస్పీ మాట్లాడారు. సమస్యాత్మక గ్రామాల్లో 24 గంటలూ పోలీసుల నిఘా ఉంటుందన్నారు. ప్రతి ఇంటిని తనిఖీ చేస్తామన్నారు. గ్రూపులుగా ఏర్పడి గొడవలు సృష్టిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. తనిఖీల్లో అచ్చంపేట సీఐ వెంకట ప్రసాద్, 60 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి



మాచర్ల: కోవిడ్ మహమ్మారి కష్టకాలంలో పనిచేసిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకొని వారికి పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బండ్ల మహేష్ కోరారు. సోమవారం మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలిపిన వారిలో ఆయన సీఐటీయూ నాయకులు, కాంట్రాక్టు కార్మికులతో కలిసి మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, కమిషనర్ డి.వేణుబాబులకు వినతి పత్రం అందజేశారు. అనంతరం పురపాలక సంఘ కార్యాలయం బయట విలేకరులతో మాట్లాడుతూ ఐదు సంవత్సరాల నుంచి మాచర్ల మున్సిపల్ శానిటరీ సెక్షన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు ఇప్పటికీ జీతాలు చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. వారు కరోనా కాలంలో ప్రాణాలను పణంగా పెట్టి కష్టపడి పనిచేశారన్నారు. పట్టణంలో ప్రజానీకం పెరుగుతున్న తరుణంలో అదనపు పనులకు టెండర్లు వేసి కాంట్రాక్టు కార్మికులను కొనసాగించి పెండింగ్ బకాయిలు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

నిజం నిలకడ మీద తెలుస్తుంది..!

నిజం నిలకడ మీద తెలుస్తుందంటారు పెద్దలు. నిజం చెప్పులు వేసుకునే లోపు అబద్ధం ఊరంతా చుట్టొస్తుందని అంటుంటారు. ఇలాంటి మాటలు ప్రతి ఎన్నికల ముందు.. తెలుగుదేశం పార్టీ, దాని మిత్ర పక్షాలు చేసే విష ప్రచారాలు, గెలిచిన తర్వాత అవి చేసే మాయాజాలాలు గమనించిన ప్రజలకు నిజమే అని రుజువు చేస్తుంటాయి. ఇందుకు ప్రత్యక్ష నిదర్శనం గత ప్రభుత్వం ప్రారంభించిన జగనన్న శాశ్వత భూ హక్కు - భూ రక్ష పథకం. ఈ పథకంపై కూటమి పార్టీలు గత ఎన్నికల ముందు ఎంత విష ప్రచారం చేశాయో అందరికీ తెలిసిందే. ప్రజల భూములను నాటి సీఎం జగన్ లాగేసుకుంటారని ఎంత గగ్గోలు పెట్టి, రచ్చ చేశాయో ప్రజలు చూశారు. ఇప్పుడు అదే భూముల రీ-సర్వే పథకాన్ని కూటమి ప్రభుత్వం పునఃప్రారంభిస్తోంది. నాడు గగ్గోలు పెట్టిన నోళ్లే.. నేడు రీ-సర్వే అద్భుతమంటూ పొగుడుతున్నాయి.



బొల్లవరంలో రీ-సర్వేలో పాల్గొన్న తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది(ఫైల్)



రైతులతో మాట్లాడుతున్న అప్పటి జేసీ శ్యామ్‌ప్రసాద్(ఫైల్)

- గొప్ప సంస్కరణగా గత ప్రభుత్వంలో సమగ్ర భూ సర్వే
- రాజకీయ లబ్ధి కోసం కూటమి పార్టీల విష ప్రచారం
- ఎన్నికల ముందు రైతులు, ప్రజల్లో అభద్రతా భావం
- నేడు భూముల రీ సర్వే అంటూ మళ్లీ 'కూటమి' ఆర్భాటం

ముప్పాళ్ల: గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భూ వివాదాల పరిష్కారంపై దృష్టి సారించారు. బ్రిటీష్ పరిపాలన అనంతరం మళ్లీ వందేళ్లకు భూముల సమగ్ర సర్వే ప్రక్రియను చేపట్టారు. భూ దందాలకు, అక్రమ బదలాయింపులకు తావులేకుండా పేదల పక్షాన నిలబడి జగనన్న శాశ్వత భూహక్కు – భూరక్ష పథకం పేరుతో రీ సర్వే చేపట్టారు. తరతరాల నుంచి లభించని భూ సమస్యలకు పరిష్కారాలు రీ-సర్వే ద్వారా పరిష్కరించారు. భూ వివాదాలతో కోర్టుల చుట్టూ తిరిగే వారికి రీ-సర్వే అపద్బంధు లాగా నిలిచింది. అప్పటి ప్రతిపక్ష నేతగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రీ సర్వే బోగస్ అంటూ విష ప్రచారం చేశారు. రైతులు, ప్రజల్లో ఒక అభద్రతభావాన్ని నెలకొనేలా చేశారు. అధికారంలోకి వస్తే రీసర్వే లేకుండా గతంలో మాదిరిగానే భూ హక్కులు కల్పిస్తామంటూ ప్రచారం చేశారు. తీరా అధికారంలోకి ఏడాది గడవకు ముందే.. భూ సర్వే చేపట్టేందుకు చర్యలు చేపట్టారు. నాడు వ్యతిరేకించిన టీడీపీ శ్రేణులు కూడా రీ సర్వేకు సహకరించాలంటూ పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నారు. రీసర్వే అమలుపై చంద్రబాబునాయుడు రెండు నాలుకల ధోరణి పట్ల నాడు అలా...నేడు ఇలా అంటూ ప్రజలు పెదవి విరుస్తున్నారు.

మండలంలో నాలుగు గ్రామాల్లో పూర్తి

మండలంలోని 10 రెవెన్యూ గ్రామాల్లో నాలుగు గ్రామాల్లో రీ-సర్వే ప్రక్రియ గత ప్రభుత్వంలో పూర్తిచేశారు. పలుదేవర్లపాడు, బొల్లవరం, లంకెల కూరపాడు, దేచవరప్పాడు గ్రామాల్లో భూముల సర్వే పూర్తి చేసి రికార్డులు కంప్యూటరీకరణ పూర్తి చేశారు. అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రీసర్వేను చేపట్టడంతో రైతులు కూడా సంతోషం వ్యక్తం చేశారు. మిగిలిన గ్రామాల్లో ప్రభుత్వం మారడంతో సర్వే నిలిచిపోయింది.

20 నుంచి నార్నెపాడులో పునఃప్రారంభం

మండలంలోని నార్నెపాడు గ్రామంలో రీసర్వే ప్రక్రియను ఈ నెల20 నుంచి కూటమి ప్రభుత్వం ప్రారంభించనుంది. మొదటి విడతగా ప్రభుత్వ భూముల గుర్తింపు చేపడతారు. ఆ తర్వాత వ్యవసాయ భూములు రీసర్వే, భూ యజమానులకు హక్కులు కల్పించేలా చర్యలు తీసుకుంటారు.

సేంద్రియ ఉత్పత్తులతో ఆరోగ్యం



ప్రకృతి వ్యవసాయ పంట ఉత్పత్తులతో ఎంటీ విజయలక్ష్మి తదితరులు

రాజుపాలెం: ప్రకృతి వ్యవసాయం ఆహారోత్పత్తులు తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని క్రోసూరు డివిజన్ ఎంటీ విజయలక్ష్మీ తెలిపారు. తహసీల్దారు కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రాన్ని సోమవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జయలక్ష్మీ మాట్లాడుతూ రసాయనిక మందులు వాడకుండా పెరటి తోటలో పండించిన తోటకూర, పాలకూర, కొత్తిమీర, పొదీన, క్యారెట్, బీట్రూట్, టమోట, చిక్కుడు, దోస మొదలగు కూరగాయలను రైతుల వద్ద నుంచి సేకరించి విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి సోమవారం తహసీల్దారు కార్యాలయం వద్ద విక్రయ కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ ఎంటీ అంజలి, తేజశ్రీ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయం

బెల్లంకొండ(పెదకూరపాడు): ప్రకృతి వ్యవసాయ ఆహార ఉత్పత్తులు తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని మండల మార్కెటింగ్ ఎంటీ అంజలి అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో ఏ గ్రేడ్, ఏటీఎం, పెరటి తోటల్లో పండించిన ఆకు కూరలు, కూరగాయల విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మండలంలోని ప్రభుత్వ ఉద్యోగులు, స్థానికులు వీటిని కొనుగోలు చేశారు. వాల్యూ చైన్ ఎన్ఎఫ్ఎఫ్ తేజశ్రీ, శ్రీరామయ్య, డీఎంఎంటీ హజరబీ, యూనిట్ ఇన్‌చార్జ్ మాధవి, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

మినరల్ వాటర్ ప్లాంట్ వితరణ



మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభించిన దాతలు

పెదకూరపాడు: మండలంలోని 75త్యాళ్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాలకు రూ.5 లక్షలతో పాఠశాల పూర్వ విద్యార్థిని ఉమా సుందరి జ్ఞాపకార్థం నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంటును సోమవారం ఆమె వర్ధంతి సందర్భంగా కుటుంబ సభ్యులు ప్రారంభించారు. విద్యార్థులకు సురక్షితమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో కాజ గ్రామానికి చెందిన ఉమాసుందరి భర్త సింహాద్రి లీలా ప్రసాదరెడ్డి, కుమారులు మనోదిలీప్ రెడ్డి, రాజీవ్‌రెడ్డి మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. పాఠశాల అభివృద్ధికి దాతలు, పూర్వ విద్యార్థులు ముందుకు రావడం హర్షణీయమని ఎంఈఓ టి.సత్యనారాయణ పేర్కొన్నారు. ఈ సందర్భంగా దాతలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జి.శివ సుందరరెడ్డి, తిరుపతి రెడ్డి, జె.సాంబిరెడ్డి, శివారెడ్డి, శ్యామ్, వెంకటరెడ్డి, మంజులత, ప్రమీల, క్రోసూరు పాలిటెక్నిక్ కళాశాల ప్రొఫెసర్ డేవిడ్ రాజు, పాఠశాల హెచ్‌ఎం ఎ.శ్రీనివాసరెడ్డి, ఎస్ఎంసి చైర్మన్ జి.పున్నారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రహదారి భద్రతా నియమాలు పాటించాలి



కార్మికులతో ఎంవీఐ డి.శేషిరెడ్డి

దాచేపల్లి : రహదారి భద్రత నియమాలు తప్పక పాటించాలని మాచర్ల మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ డి.శేషిరెడ్డి అన్నారు. గామాలపాడు, సాగర్ సిమెంట్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న కార్మికులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. 36వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా సోమవారం వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శేషిరెడ్డి మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్, త్రిపుల్ రైడింగ్ వంటి వాటి వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. డ్రైవింగ్‌పై పూర్తి అవగాహన ఉన్న వారు వాహనాలు నడపాలన్నారు. నియమాలు ఉల్లఘించే వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కారు డ్రైవ్ చేసే సమయంలో సీటు బెల్టు ధరించాలన్నారు. మితిమీరిన వేగంతో వాహనాలు నడపరాదన్నారు. సాగర్ సిమెంట్ ప్లాంట్ హెడ్ సుబ్బారావు, అధికారులు పాల్గొన్నారు.

పశువులకు వైద్య సేవలు



గేదెకు వైద్య పరీక్ష చేస్తున్న డాక్టర్ శ్రీదేవి

పెదకూరపాడు: మండలంలోని 75 త్యాళ్లూరు గ్రామంలో సోమవారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. పశుసంవర్ధకశాఖ ఏడీ సారధిబాబు ప్రారంభించారు. పశువైద్యాధికారి డాక్టర్ శ్రీదేవి మాట్లాడుతూ మండలంలో 490 పశువులకు నులిపురుగుల నివారణ చర్యలను చేపట్టామని, 32 పశువులకు గర్భకోశ వ్యాధికి చికిత్స అందించినట్లు తెలిపారు. దూడలకు వ్యాక్సిన్ వేసినట్లు తెలిపారు. శిబిరంలో ఏహెచ్ఎల్‌లు బోసు, పావని, అంబికా, షఫీ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

1,446 పశువులకు, జీవాలకు చికిత్స

క్రోసూరు: మండలంలోని బయ్యవరం, పెరికపాడు గ్రామాల్లో సోమవారం జరిగిన పశు ఆరోగ్య శిబిరాల ద్వారా 1,446 పశువులు, జీవాలకు వ్యాధి నివారణ చికిత్స, టీకాలు అందించినట్లు మండల పశువైద్యుడు ఎం.మల్లయ్య తెలిపారు. పెరికపాడు శిబిరంలో 317 పశువులకు చికిత్స, 576 జీవాలకు వాక్సినేషన్ చేసినట్లు చెప్పారు. మధ్యాహ్నం నుంచి జరిగిన బయ్యవరం శిబిరంలో 153 పశువులకు చికిత్స, 400 జీవాలకు వ్యాక్సిన్లు వేసినట్లు వెల్లడించారు. గోపాల మిత్రులు, వెటర్నరీ విలేజ్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో పశువైద్య శిబిరాలు

రాజుపాలెం: మండలంలోని అంచులవారిపాలెం, బలిజేపల్లి గ్రామాల్లో పశు వైద్య శిబిరాలు సోమవారం నిర్వహించారు. అంచులవారిపాలెం పశువైద్యాధికారి కె.నాగేశ్వరరావు పాల్గొని 22 పశువులకు సాధారణ, 20 పశువులకు గర్భకోశ వ్యాధులు, 18 పశువులకు సూడు పరీక్షలు నిర్వహించారు. 700 పశువులకు, 120 దూడలకు, 700 గొర్రెలకు నట్టల నివారణ మందు, బొబ్బా టీకా వేశారు. బలిజేపల్లి పశువైద్య శిబిరంలో పశువైద్యాధికారి శివకుమార్ పాల్గొని 15 పశువులకు సాధారణ, 14 పశువులకు గర్భకోశ, 19 పశువులకు సూడు పరీక్షలు చేశారు. 27 పశువులకు, 38 దూడలకు, 300 గొర్రెలకు నట్టల నివారణ, బొబ్బా టీకా వేశారు. రెండు గ్రామాలలో 80 మంది పాడి రైతులు లబ్ధిపొందినట్లు రాజుపాలెం పశువైద్యాధికారి వీరయ్య తెలిపారు. ముందుగా శిబిరంలో వైస్ ఎంపీపీ హరిసూరమ్మనాగేశ్వరరావు పాల్గొని అంచులవారిపాలెం పశువైద్య శిబిరాన్ని ప్రారంభించారు.

నాగిరెడ్డిపాలెంలో పశు వైద్య శిబిరం

బెల్లంకొండ (పెదకూరపాడు): మండలంలోని నాగిరెడ్డిపాలెం గ్రామంలో సోమవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. 70 పశువులకు, 14 ఎదకురాని పశువులకు, 23 గేదెలకు, 31 దూడలకు నట్టాల నివారణ మందు, 50 జీవాలకు బొబ్బ టీకాలు వేశారు. పశు వైద్యుడు డాక్టర్ జి.బాలకృష్ణారెడ్డి, సిబ్బంది, గోపాల మిత్రులు పాల్గొన్నారు.

నేడు పశువైద్య శిబిరం

ముప్పాళ్ల: మండలంలోని లంకెలకూరపాడు మంగళవారం పశు వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మండల పశువైద్యాధికారి ఎం.పుల్లారెడ్డి సోమవారం తెలిపారు. పశు పోషకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

అచ్చంపేట: సీజనల్ వ్యాధుల పట్ల పశు పోషకులు, గొర్రెలు, మేకలు పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలని పశువైద్యాధికారి డాక్టర్ స్వాతీదేవి తెలిపారు. పుట్లగూడెంలో సోమవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాలు గ్రామ గ్రామాన ఈ నెల 31వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు. శిబిరంలో 30 పశువులకు సాధారణ, గర్భకోశ వ్యాధుల పరీక్షలు నిర్వహించి, అవసరమైనవాటికి చికిత్స చేశారు. 180 పశువులకు, దూడలకు ఏలికపాముల నివార మందు వేశారు. 1,100 జీవాలకు నట్టల నివారణ మందు, 1,450 జీవాలకు బొబ్బ టీకా వేశారు. వైద్య శిబిరాన్ని గ్రామ సర్పంచ్ తోట పాపారావు ప్రారంభించారు. గ్రామపెద్దలు పాల్గొన్నారు.

నేడు మాచర్లలో ఉద్యోగ మేళా

మాచర్ల : స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్, ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో మాచర్ల పట్టణంలో మంగళవారం ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు అధికారులు సోమవారం తెలిపారు.

ఫిషర్‌మెన్ కో-ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడిగా పుల్లయ్య



సొసైటీ ఎన్నికల్లో పాల్గొన్న సభ్యులు

సత్తెనపల్లి: ది వడ్డవల్లి ఫిషర్ మెన్ కో–ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడిగా మంగళపూరి పుల్లయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పట్టణంలో ది వడ్డవల్లి ఫిషర్ మెన్ కో–ఆపరేటివ్ సహకార సంఘం లిమిటెడ్ పాలక వర్గ ఎన్నిక సోమవారం పట్టణంలో గుంటూరు న్యాయవాది షేక్ అబ్దుల్ ఘని ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉపాధ్యక్షుడిగా సాధు బాలాజీ, కార్యదర్శిగా మంగళపూరి శ్రీనివాసరావును ఎన్నుకున్నారు. పాలకవర్గ సభ్యులుగా మంగళపూరి శ్రీనివాసరావు, పిట్టల ఏసుబాబు, మంగళపూరి శ్రీనివాసరావు అలియాస్ శీనయ్య, మంగళపూరి పుల్లయ్య, మంగళపూరి ఆదెయ్య, సాధు బాలాజీ, మారం శేషగిరిరావు, సాధు నాగేశ్వరరావు, గరిక వెంకయ్య ఎన్నికయ్యారు. వీరి పదవి కాలం 2030 జనవరి 20 వరకు ఐదేళ్ల పాటు కొనసాగనుంది.

లక్ష్మణరావు గెలుపునకు కృషి చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న రవిబాబు

బెల్లంకొండ(పెదకూరపాడు): ఎమ్మెల్సీ ఎన్నికల్లో కె.ఎస్.లక్ష్మణరావును గెలిపించుకోవాలని సీఐటీయూ జిల్లా నాయకుడు రవిబాబు కోరారు. బెల్లంకొండలో సోమవారం పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి లక్ష్మణ్ రావును బలపరుస్తూ అవగాహన సమావేశం నిర్వహించారు. రవిబాబు మాట్లాడుతూ నిజాయితీ కలిగిన లక్ష్మణరావుని గెలిపించి సమస్యలను పరిష్కరించుకోవాలని తీర్మానించారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి, నాయకులు సీహెచ్ పుల్లారావు, బూతుకూరు నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా వైద్య పరీక్షలు



క్రోసూరు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమంలో భాగంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ ధనుష్, దొడ్లేరులో డాక్టర్ సాద్, డాక్టర్ సిరి చందన పాల్గొన్నారు. పుట్టుకతో వచ్చే గుండె జబ్బులు, చెవుడు, అంధత్వం, నోటి వ్యాధులు, మానసిక ఆరోగ్య సమస్యలు లాంటి అనేక రకాల వ్యాధులు, ఆరోగ్య సమస్యల తెలుసుకునేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ ధనుష్ చెప్పారు. ఎన్‌డీసీ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు ఇంటింటికీ వెళ్లి నాన్ కమ్యూనికబుల్ వ్యాధులు ఉన్న వారిని గుర్తించి, వివరాలు నమోదు చేసుకున్నారు. అలాగే కుష్ఠు సర్వే చేపట్టారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ వినియోగదారులకు లోక్ అదాలత్

పిడుగురాళ్ల: ఈ నెల 22న పిడుగురాళ్ల శివారులోని కొండమోడు వద్ద గల పిడుగురాళ్ల సబ్ డివిజన్ కార్యాలయంలో లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు విద్యుత్ శాఖ ఇన్‌చార్జి ఏఈ సైదారావు సోమవారం తెలిపారు. ఈ లోక్ అదాలత్ కార్యక్రమం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరుగుతుందని చెప్పారు. ఇందులో విద్యుత్ వినియోగదారుల సమస్యలను పరిష్కరించడంతోపాటు, అవగాహన కూడా కల్పించటం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి చైర్‌పర్సన్ సీజీఆర్ఎఫ్ ఎన్.విక్టర్ ఇమ్మానుయేల్ హాజరై విద్యుత్ వినియోగదారులకు అవగాహన కల్పిస్తారని ఆయన తెలిపారు.

పొదలమాటున విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు



చల్లగుండ్లలోని రైస్‌మిల్ రోడ్డులో పొదల్లో ట్రాన్స్‌ఫార్మర్



చల్లగుండ్ల దేచవరం రోడ్డులో కమ్మేసిన పిచ్చిమొక్కలు

విద్యుత్ శాఖ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తున్నారు. ఎక్కడికక్కడ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలు కమ్మేసి ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. అన్నీ కూడా ప్రధాన రోడ్లకు, కార్యాలయాలకు సమీపంలో ఉన్నా.. విద్యుత్ శాఖ అధికారులకు కన్పించకపోవడం విశేషం. - నకరికల్లు



చేజర్ల సచివాలయం ఎదుట ఇలా..



చేజర్ల వైఎస్సార్ కాలనీలోని మసీదుకు ఆనుకొని ప్రమాదకరంగా..